ఆదుకొనేవారేరీ?

- వరదలకు పాడైన పంటలు
- పట్టించుకోని నేతలు
- పెట్టుబడులు రాక రైతుల దిగాలు

మామిడికుదురు: గోదావరి వరదల వల్ల పంటలు పాడైపోయి తీవ్రంగా నష్టపోయాం. ఒకటి కాదు రెండు పర్యాయాలు గోదావరి వరద పంటలను ముంచెత్తింది. పంట ఉత్పత్తి దశకు వచ్చే సమయంలో వరద తమ పాలిట శాపంగా మారిందంటూ రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, కనీసం తమను పలకరించిన వారు కూడా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. మామిడికుదురు, పి.గన్నవరం, సఖినేటిపల్లి, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు తదితర మండలాల్లో గోదావరి వరదకు పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. అరటి తోటలతో పాటు బీర, బెండ, మునగ, వంగ, ఆనబ, టమాటా, మునగ, బొప్పాయి, కొత్తిమీర, తోట కూర, గోంగూర తదితర పంటలు దెబ్బతిన్నాయి. మండలాల వారీగా జరిగిన పంట నష్టాలను నమోదు చేసి పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

1500 ఎకరాల్లో పంటలకు నష్టం

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో సుమారు 1500 ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. చిన, సన్నకారు రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండించారు. తీరా పంటలు చేతికందే సమయంలో వరద రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని రైతులు లబోదిబోమంటున్నారు. తమ గోడు ఎవరికీ పట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.


పెదపట్నంలంకలో ఎండిపోయిన మునగ తోట

రూ.లక్ష నష్టం వచ్చింది



కూరగాయల సాగు ద్వారానే మేము జీవనం సాగిస్తున్నాం. ఎంతో కష్టపడి పంటలు పండించడం. వరదలకు పంటలు పాడైపోవడం మాకు శాపంగా మారింది. రెండెకరాల్లో కూరగాయలు సాగు చేశా. దీనికి రూ.లక్షకు పైగా పెట్టుబడి అయ్యింది. ప్రకృతి వైపరీత్యాలు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నా మా పరిస్థితి మాత్రం ప్రభుత్వానికి పట్టడం లేదు. పరిహారం అందించి మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొమ్ముల వెంకటేశ్వరరావు, రైతు, పెదపట్నంలంక

రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను



రూ.30 వేలు పెట్టుబడి పెట్టి ఆరు కుంచాల్లో బీర పాదులు పెట్టా. చేతిలో చిల్లి గవ్వ కూడా లేని పరిస్థితుల్లో అప్పు చేసి వ్యవసాయం చేశా. తీరా పంట దిగుబడి ఇచ్చే సమయంలో గోదావరి వరద పంటను పూర్తిగా ముంచెత్తింది. రెండు సార్లు ముంపు రావడంతో బీర పాదులు చనిపోయాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– కొమ్ముల శ్రీను, రైతు, పెదపట్నంలంక

ఈ ఏడాదైనా పరిహారం ఇస్తారా!



ప్రతి ఏడాది గోదావరి వరదలకు నష్టపోవడం మా రైతులకు అలవాటుగా మారింది. ప్రభుత్వాలు రైతుల్ని మాత్రం పట్టించుకోవడం లేదు. గత ఏడాది గోదావరి వరదకు పంటలు దెబ్బతిన్నా పరిహారం ఇవ్వలేదు. ఈ ఏడాది ఎకరం పొలంలో కూరగాయలు సాగు చేశాను. రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంటలు మొత్తం పాడైపోయాయి. మమ్మల్ని ఆదుకుంటారని ఆశిస్తున్నాం.

– యేడిద నాయుడు, రైతు, పెదపట్నంలంక

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'పై జగ్గిరెడ్డికి నివేదిక

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంపై సమగ్ర నివేదికను వైఎస్సార్ సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డికి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు బుధవారం అందజేశారు. ఈ మేరకు గోపాలపురంలో జగ్గిరెడ్డిని, నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడుతో కలసి గొల్లపల్లి పై నివేదిక ఇచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 60 గ్రామాల్లో ఇంటింటికీ వంచన పేరుతో పై కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసినట్టు గొల్లపల్లి, జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గొల్లపల్లిని, నలుగురు మండల పార్టీ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి అభినందించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, మండపేట పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, జెడ్పీటీసీ బళ్ళ ప్రసన్నకుమారి, ఎంపీపీ శ్రీధర్, మండల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాస్, మహిళా నాయకురాలు గుబ్బల రోజారమణి, నాయకులు గుబ్బల మనోహర్, మోకా సురేష్, గుర్రం జాషువా, ఉచ్చుల విష్ణు, ఉచ్చుల దాసు, కొల్లాబత్తుల సతీష్, పార్టీ పలు విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గోపాలపురంలో జగ్గిరెడ్డితో సమావేశమైన గొల్లపల్లి, పాపారాయుడు

ఆలోచనలు అదుపులో ఉండాలి

మలికిపురం: విశ్వేశ్వరాయపురంలో బుధవారం ఆత్మహత్యలు లేని సమాజస్థాపనే ధ్యేయంగా పని చేస్తున్న స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా 'వాక్ టాక్' అనే ప్రత్యేక కార్యక్రమం జరిగింది. విద్యార్థులు ఆత్మహత్యల నివారణ, జీవన విలువ, ఆశతో ముందుకు సాగడం, సానుకూల ఆలోచన వంటి విషయాలపై యుఆర్ వర్రీ, రెస్పెక్ట్ యువర్ సెల్ఫ్, వెయిట్, టుమారో ఈజ్ అనదర్‌డే అంటూ నినాదాలు చేస్తూ రాలీ నిర్వహించారు. సంస్థ జిల్లా ఇన్‌చార్జి ఎస్.రమేష్ బాబు విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ధైర్యం, జీవితంపై గౌరవం పెంపొందించుకోవాలన్నారు. స్పందనా ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రైజ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ఆత్మహత్య అనేది సమస్యకు మార్గం కాదని, అది ఆశను కోల్పోవడమే అన్నారు. విద్యార్థులు నిరాశలో కాకుండా, ధైర్యంగా ముందుకు సాగాలని, అవసరమైతే తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాజేష్, లక్ష్మి, పద్మజ, అరుణ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

మలికిపురం: ప్రజలు, విద్యార్థులు రోడ్డు భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కాలేజీలో వినియోగదారుల హక్కులు, రోడ్డు భద్రత ప్రమాణాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సంఘ అధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు సేవలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అందరూ పాటించడం వలన మన, ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. సీట్ బెల్ట్ హెల్మెట్ ధరించడం తప్పనిసరని వేగ పరిమితులు పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావును దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నల్లి ఆనందమహాని, కోళ్ల వేణుప్రసాద్, గడ్డం తులసీభాస్కర్, ఎంఈఓలు విజయశ్రీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ సారథులకు సన్మానం

రావులపాలెం: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన జున్నూరి రామారావు (బాబి), కొత్తపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా నియమితులైన పాటి శివకుమార్‌లను మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో వారిద్దరిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, ఆత్రేయపురం మండల పార్టీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో జున్నూరి బాబి, శివకుమార్‌లను సత్కరిస్తున్న జగ్గిరెడ్డి

కనీసం రెండు కరవు భత్యాలైనా ఇవ్వండి

మలికిపురం: మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ మలికిపురం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం జరిగింది. మలికిపురంలో జరిగిన సమావేశంలో సంఘ నాయకులకు ఉపాధ్యాయులు వివిధ సమస్యలను వివరించారు. సమావేశంలో పాల్గొన్న పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర అధికారులు, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. కనీసం రెండు కరవు భత్యం బకాయిలను వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ కమిటీని నియమించి ఈ లోగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వర్కులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు అప్పారి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పంగం నీలారావు, అడబాల గంగయ్య, ఏపుగంటి వెంకట పద్మనాభం, ఆచంట పెద్దిరాజు, నల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లో-ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

మామిడికుదురు: ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఎంతో కాలం నుంచి ఎదుర్కొంటున్న లో-ఓల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందని నగరం విద్యుత్ సబ్ స్టేషన్ జేఈ వెంకటేశ్వరరావు తెలిపారు. నగరం గ్రామంలోని ఈదరాడ కాలువగట్టు రోడ్డు, పెదపట్నం రోడ్డులో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం జేఈ ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల చొరవతో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. స్థానికులు జాలెం సుబ్బారావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


నగరంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జేఈ వెంకటేశ్వరరావు

పౌష్టికాహారం తీసుకోవాలి

మామిడికుదురు: గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో ఉన్న పిల్లలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని కోనసీమ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్‌చార్జ్ అధికారి వై.విజయశ్రీ సూచించారు. అప్పనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎ.అంబికాదేవి పలు విభాగాల ప్రతినిధులతో కలసి బుధవారం పలు అంశాలపై సంకల్ప అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో న్యాయ, వైద్య, రక్షణ, వసతి, కౌన్సిలింగ్ ఈ అయిదు అంశాలపై ఉచిత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు, పబ్లిక్ ప్రాంతాల్లో హింసకు గురైన మహిళలకు అండగా నిలిచి వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు పౌష్టికాహారంపై కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, తగినంత నిద్ర పోవాలని, ఒత్తిడిని తగ్గించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఆరోగ్య జీవన శైలిని అలవర్చుకోవాలని చెప్పారు. దీని ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండవచ్చని అవగాహన కల్పించారు.


అప్పనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న విజయశ్రీ

ఎమ్మార్పీఎస్ నుంచి మండల ఇన్‌చార్జ్ సస్పెన్షన్

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పదవి నుంచి ఉండ్రాజవరపు శివను సస్పెండ్ చేస్తూ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ సామ్రాట్ కేబీ మధు మాదిగ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల రాజోలు మండలం జగ్గన్నపేటలో జరిగిన ఆటో డ్రైవర్ సంఘటనలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలో జిల్లా ఎమార్పీఎస్ అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాదిగ మీద, ఆటో డ్రైవర్ మీద ఎఫ్ఐఆర్ వేయించమని ఎమ్మెల్యేకు మద్దతుగా నిలిచినందుకు ఎమ్మార్పీఎస్ నుంచి, మామిడికుదురు మండల ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి శివను తొలగించామన్నారు. పార్టీలో పని చేస్తూ ఎమ్మెల్యేల మెప్పు కోసం, జాతికి ద్రోహం చేసే కార్యక్రమాలు వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం


రాజోలు: ప్రయాణికులకు తాగునీరు సదుపాయం కల్పించేందుకు రాజోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఆర్వో వాటర్ ప్లాంట్‌ను దాత రుద్రరాజు రంగరాజు, ఆయన సతీమణి వెంకట సుబ్బాయమ్మలు ప్రారంభించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన డిపో మేనేజర్ పి.ధనమ్మ విజ్ఞప్తి మేరకు దాత రుద్రరాజు రంగరాజు రూ.1.50 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్ దాతలను రాజోలు డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రయాణికులు కూర్చునేందుకు మెరుగైన సిటింగ్ కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌టీఐ కేకే దొర, టీఐ ఎంఏ రావు, సూపర్‌వైజర్లు వి.శ్రీనివాసరావు, ఏవీ రావు, సోషల్ వర్కర్స్ బోనం రాజు, అరిగెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సేవలకు తగిన గుర్తింపు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నల్లమిల్లి సురేష్‌రెడ్డి అందించిన విశేష సేవలకు తగిన గుర్తింపు లభించిందని ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యాఖ్యానించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించిన సందర్భంగా ఆలమూరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సభ్యుల బృందం అవార్డు గ్రహీత సురేష్‌రెడ్డిని బుధవారం ఘనంగా సత్కరించింది. ప్రిన్సిపల్‌గా విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు కళాశాల అభ్యున్నతికి కోసం చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు సంయుక్తంగా అవార్డు గ్రహీత సురేష్‌రెడ్డిని శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

కవి 'దేవరకొండ'కు కవనగీష్పతి పురస్కారం

రాజోలు: తెలుగు పండితుడు, కవి దేవరకొండ శ్రీనివాస వెంకట రమణరావుకు తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి సంస్థ శ్రీకృష్ణదేవరాయ పురస్కారమైన కవనగీష్పతికి ఎంపిక చేసింది. కవనగీష్పతి పురస్కారానికి ఎంపికై న దేవరకొండను బుధవారం పలువురు అభినందించారు. ఈ నెల 12వ తేదీన తిరుపతిలో జరిగే 35వ వార్షిక శ్రీ కృష్ణదేరాయ కల్యాణోత్సవాల్లో పురస్కారాన్ని అందుకుంటారు. ఈ మేరక సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజాలకు దేవరకొండ కృతజ్ఞతలు తెలిపారు.


వెంకట రమణరావు

చెరువు విశిష్టతను కాపాడండి

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో చెరువు మధ్య వేంచేసిన లక్ష్మీనారాయణ ఆలయ విశిష్టతను కులమతాలకు అతీతంగా కాపాడుకుందామని కోటి దీపాల ఉత్సవ కమిటీ, బీసీ సంఘ నేతలు సూచించారు. స్థానిక చెరువులోనే కొంతమంది శివలింగం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్న విషయం తమ దృష్టికి తీసుకురావడంతో వివరణ ఇస్తున్నామన్నారు. గత 35 ఏళ్లుగా చెరువు మధ్యలో వేంచేసిన దేవతామూర్తులకు ఏటా కోటి దీపోత్సవాల ఉత్సవాన్ని చేస్తున్న సంగతిని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం ఒక కమిటీ నేతృత్వంలో సామరస్య పూరిత వాతావరణంలో జరుగుతున్న కార్యక్రమాలకు అవరోధం కలిగించడం వల్ల ఆలయ విశిష్టత దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లగా వారందరూ సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని తెలియజేశారు.

17 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు


కొత్తపేటలో పీడీ, పీఈటీలతో సమీక్షిస్తున్న ఎంఈఓ హరిప్రసాద్

కొత్తపేట: 2025-26 సంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు పీడీ, జిల్లా ఎస్‌జీఎఫ్ (విమెన్) సెక్రటరీ ఏఎస్ఎస్ రమాదేవి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ వై రాంబాబు, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ సమక్షంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమాదేవి క్రీడా పోటీల నిర్వహణపై పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ హరిప్రసాద్ అధ్యక్షతన ఏర్పాట్లపై సమీక్షించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా, చెస్ (బాలురు అండ్ బాలికలు), అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ నెల 17న బాలురకు, 18న బాలికలకు, 19న బాలురు అండ్ బాలికలకు స్పోర్ట్స్ నిర్వహిస్తారని రమాదేవి తెలిపారు. ఈ పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నలుగురు 28వ సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. అమలాపురంలో సోమవారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-13 (సబ్ జూనియర్స్) జట్టుకు పాఠశాలకు చెందిన కె.జానకి, జి.కావ్య, డి.నాగశ్రీ, ఎన్‌గీతికలు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం కె.సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి బుధవారం తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని పాఠశాల పీఈటీలు ఎ.ఉమామహేశ్వరరావు, అందే సూర్యకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు బీఎస్ఏ మూర్తి, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

దోమల నిర్మూలనకు చర్యలు


ఆదుర్రులో దోమల వ్యాప్తి నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఆదుర్రు శివారు మోరిపాలెం, పాశర్లపూడి గ్రామాల్లో బుధవారం ఎబేట్ మందును పిచికారీ చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగునీటి గుంటల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ప్రాణాంతమైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని కార్యదర్శులు బీవీవీ సత్యనారాయణ, వాసు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాసరావు, కొనుకు ప్రేమజ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు కొమ్మూరి ఉమా మహేశ్వరరావు, కొమ్ముల సూర్యనారాయణ, ఏఎన్ఎం వైకేడీ నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


శ్రీరామకృష్ణను సత్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక జెడ్పీహెచ్‌లో ఇంగ్లీషు టీచర్‌గా పని చేస్తున్న దొమ్మేటి శ్రీరామకృష్ణ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. ఆయనను బుధవారం స్కూల్లో జరిగిన సమావేశంలో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరామకృష్ణ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. ఆతన్ని సహచర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అన్నసమారాధనకు రూ.20 వేల విరాళం

ఆలమూరు: స్థానిక పసుపులేటిగూడెంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో నిర్వహించే అన్నసమారాధనకు రూ.20 వేలు విరాళం అందజేత జరిగింది. శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు తన కుటుంబ సభ్యులతో కలసి గురువారం స్థానిక ఆలయ కమిటీకి ఈ విరాళం మొత్తాన్ని అందజేశారు. చల్లా సుధీర్, చిన్నం కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దసరాకు రాట ముహూర్తం


అంబాజీపేటలో రాటకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అంబాజీపేట: స్థానిక విజయ కనకదుర్గా భక్తాంజనేయ స్వామి వారి గుడి వద్ద విజయదశమి వేడుకలను పురస్కరించుకుని శరన్నవరాత్రులకు సంబంధించి బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ధనూష్ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 22 నుంచి అమ్మవారి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కొత్తపేట: స్థానిక పొట్టి శ్రీరాములు వీధి వరసిద్ధి వినాయక పందిరిలో బుధవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు అనంతరం అన్నసమారాధన జరపడం ఆనవాయితీ. దానిలో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. విందు భోజనం తరహాలో వివిధ రకాలతో అన్నదానం ఏర్పాటు చేశారు. కొత్తపేట, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మలికిపురం: వారధి ఇండియా ఫౌండేషన్-2025 మండల స్థాయి పోటీలు బుధవారం మలికిపురం ఎంఈఓ కార్యాలయంలో జరిగాయి. ఎంఈవో ఎం.విజయశ్రీ సమక్షంలో పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థుల కోసం జరిగిన వ్యాసరచన పోటీలనుద్దేశించి మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం, నైపుణ్యాలను పెంపొందించడంలో దోహదపడతాయన్నారు. ఎంఈవో-2 వైవీవీ సత్యనారయణ మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

హిందీ సలహా కమిటీ సభ్యుడిగా సాధిక్

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత షంషు సాధిక్‌ను హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమించారు. నీతి ఆయోగ్, ప్రణాళిక మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించిన ఆదేశాలను జారీ చేసింది. ఈ ఆదేశాలు బుధవారం సాధిక్‌కు అందాయి. పలువురు సాధిక్‌ను అభినందించారు.

వసతులు మెరుగ్గా ఉండాలి

మలికిపురం: విద్యారంగ సమస్యలపై అమలాపురంలో జిల్లా విద్యాశాఖ అధికారి(డీఇఓ)కి ఆల్ స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆస్వా) అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ వినతిపత్రం అందించారు. రాజోలు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రక్షిత మంచి నీటి సదుపాయం కల్పించాలని, క్రీడా మైదానాలు బాగుచేయాలని, చిన్నపాటి వర్షానికే విద్యా ప్రాంగణాలు వర్షపునీటితో నిండిపోతున్నాయని, వర్షాకాలంలో స్కూలు ప్రాంగణాలు దోమలతో నిండిపోతున్నాయని, పరిసరాలు శుభ్రంగా ఉండట్లేదని, శానిటేషన్ చేసి పిల్లలకు రోగాలు సోకకుండా కాపాడాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

ముంపునీటి పంపింగ్ సిస్టమ్ ప్రారంభం


సముద్రంలోకి ముంపునీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేదికర పరిసర గ్రామాల్లో వర్షాల కాలంలో తట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్న ముంపునీటిని అంతర్వేదికరలో సముద్రంలోకి మోటార్ల ద్వారా పంపింగ్ చేసే సిస్టమ్‌ను బుధవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించి, పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తీర గ్రామాల్లో వర్షం నీరు మురుగు కాలువల్లోకి ప్రవహించక, వరిచేలు మునిగి పంటలు సరిగా పండడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి రైతులు స్వచ్ఛందంగా విరాళాలతో రెండు 10 హెచ్‌పీ మోటార్లు సమకూర్చుకున్నారని, దీనికి అర కిలోమీటరు పైపు లైన్ కూడా వేసుకున్నారన్నారు. రైతులు చూపిన చొరవను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

రాజోలు: కడలి ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థినులకు బుధవారం దుస్తుల పంపిణీ చేశారు. దాత కాదంబరి మల్లపరాజు రూ.11 వేలతో 22 మంది ఇంటర్ విద్యార్థినులకు యూనిఫారమ్స్ సమకూర్చారు.